ప్రజాశక్తి
మంగళవారం 10 సెప్టెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె వాయిదా

ప్రజాశక్తి-పాడేరు : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సోమవారం సిఐటియు, ఏఐటియుసి నాయకులు ఎల్.సుందర్రావు, అమర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీ తర్వాత ఏ రోజైనా సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేయాలని ముందు నిర్ణయించామని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగ వేతనాలు ఆరు నెలలు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఆకౌంట్లో ఒక నెల జీతం బకాయి చెల్లించడంతో పాటు మిగిలిన ఐదు నెలలు బకాయి చెల్లిస్తామని చెప్పడంతో పాటు తుఫాన్ కారణంగా రోగాలతో వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా అందుబాటులో నుండి వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని వారు తెలిపారు. ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేసి ప్రతి నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మన్యంలో కుండపోత వర్షాలు

పోటెత్తిన నదులు, వాగులు
జలదిగ్బంధంలో రహదారులు
అనేక గ్రామాలకు రాకపోకలు బంద్

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

మన్యంలో ఆది, సోమవారాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. దీనికి తోడు ఒడిశాలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు దిగువకు ప్రవహించడంతో అల్లూరి జిల్లాలోని పలు నదులు, వాగులు పొంగి ప్రవహించాయి. పలు రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకోగా, అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

సీలేరు : భారీ వర్షాలకు జికె.వీధి మండలంలో 16 పంచాయతీల పరిధిలో పంట పొలాలు నీటి పూర్తిస్థాయిలో మునిగాయి. వాగులు వంకలు ప్రమాద స్థాయికి పొంగి ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పలు చోట్ల కల్వర్టులు, వంతెనలు కొట్టుకుపోయాయి. సీలేరు- లంకపాకల రహదారిపై అనేక చోట్ల ఆదివారం రాత్రి కొండ చరియలు విరిగి రహదారి అడ్డంగా పడ్డాయి. రాళ్లు, చెట్లు, ఇసుక మేటలు వేసి రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. కనీసం ద్విచక్ర వాహనం రావడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. భారీ వర్షానికి సీలేరు సమీపంలో ఐస్ గెడ్డ మధ్యలో మూడు చోట్ల రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. సీలేరు నుంచి 7 కిలోమీటర్ల దూరంలో భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిలో వలస గెడ్డ వంతెన ఇరువైపుల కోతకు గురైంది. వంతెన పైనుంచి సుమారు 10 అడుగుల వరద నీరు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోవడంతో భద్రాచలం, రాజమండ్రి, విజయవాడ వెళ్లవలసిన బస్సు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. కలెక్టర్, ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు ఆర్ అండ్ బి అధికారులు, పోలీసులు, గుత్తేదారుడు రహదారి క్లియరెన్స్ పనులు చేపట్టారు.

వరద నీటిలో చిక్కుకున్న కూలీలు

ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు అంతర్రాష్ట్ర రహదారి దుప్పిలివాడ పంచాయతీ పిల్లిగెడ్డ నూతన వంతెన నిర్మాణ పనులకు వచ్చిన ఐదుగురు కూలీలు పిల్లిగెడ్డ వరదనీరులో ఆదివారం రాత్రి చిక్కుకుపోయారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఏం చేయాలో తెలియక రాత్రంతా వరద నీరులోనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. సోమవారం తెల్లవారి జామున తమను రక్షించాలని పెద్దపెద్ద కేకలు వేయడంతో సమీపంలో ఉన్న పిల్లి గెడ్డ గ్రామస్తులు వారిని రక్షించారు. ఒక్కొక్కరిని ప్రవహిస్తున్న పిల్లిగెడ్డ వాగు నుంచి ప్రాణాలతో బయటికి తీసుకువచ్చారు. రాత్రంతా ఒక పక్క జోరును వర్షం మరోపక్క వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగు పక్కను చేరుకొని నీటిలో రాత్రంతా ఉండిపోయి ప్రాణ భయంతో తల్లడిల్లిపోయినట్లు బాధిత కూలీలు తెలిపారు. పిల్లిగెడ్డ నిర్మాణ పనులకు ఉపయోగించిన జెసిబి, ట్రాక్టర్ తమ కళ్లముందే నీటి ప్రవాహాన్ని కొట్టుకుపోయాయని చెప్పారు.

పిఒ పర్యటన

భారీ వర్షాల నేపథ్యంలో పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ సోమవారం జికె.వీధి మండలం సంపంగి గొంది, లంకపాకలు గ్రామాల వరకు పర్యటించి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. జాతీయ రహదారి అధికారుల సహాయం తీసుకుని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. లంకపాకలు గ్రామం వద్ద కల్వర్టు దగ్గర భారీ కేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి రహదారుల మరమ్మతులకు సహకారం అందించాలని కోరారు. రింతాడ గ్రామం వద్ద వర్షాలకు దెబ్బతిన్న రహదారిని పరిశీలించారు. పిఒ వెంట ఆర్ అండ్ బి అధికారులు బాల సుందర బాబు, గిరిజన సంక్షేమ శాఖ డిఇ చాణక్యరావు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

జికె.వీధి మండలంలో వాగు అవతల చిక్కుకుపోయిన కూలీలను తీసుకొస్తున్న స్థానికులు

పోటెత్తిన నదులు, వాగులు

చింతూరు : భారీ వర్షాలకు ఎగువ ప్రాంతంలో ఉన్న జలాశయాల నుండి నీరు వచ్చి చేరడంతో చింతూరు శబరి నది నీటిమట్టం సోమవారం ఒక్కసారిగా 38 అడుగులకు ప్రమాద స్థాయికి చేరింది. డొంకరాయి డ్యామ్ నుండి ఆదివారం రాత్రి 11 గేట్లను ఎత్తి లక్ష పదివేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో లోతట్టు ప్రాంతాలైన సూరన్నగొంది, మదుకూరు తదితర గ్రామాలు ముంపుకు గురయ్యాయి. సోకిలేరు వాగు ప్రమాదకరంగా పెరిగింది. కుమ్మూరు, కోయగూరు, చంద్రవంక వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల వరదల కారణంగా ఇప్పటికే అధికారులు మారేడుమిల్లి, సీలేరు, కాకినాడ రాజమండ్రి విశాఖ తదితర ప్రాంతాలకు బస్సులను రద్దు చేశారు. ఒడిస్సా రాష్ట్రంలో మరో అల్పపీడన ద్రోణి ఏర్పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు మైకుల ద్వారా ప్రచారం చేశారు. వర్షాలకు పొంగిన వాగుల కారణంగా మండలంలోని సూటూరు, నర్సింగ పేట, ముకునూరు, కల్లేరు, కోయగూరు, ఉలుమూరు, ఏజీ కోడేరు, మల్లె తోట, కొమ్మూరు, మామిళ్ళ గూడెంతో పాటుగా సుమారు 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

మోతుగూడెం : మన్యంలో కురుస్తున్న వర్షాలకు డొంకరాయి డ్యామ్‌కి భారీగా వరద నీరు రావడంతో ఆదివారం రాత్రి ఏపీ జెన్‌కో అధికారులు దిగువకు నీటి విడుదల చేశారు. దీంతో సీలేరు నది ఒకసారిగా ఉగ్రరూపం దాల్చింది. చింతూరు, మోతుగూడెం ప్రధాని రహదారి మీదకి వరద నీరు రావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో చెట్లు పడిపోవడం వల్ల ట్రాఫిక్‌కి అంతరాయం కలిగింది.

అన్నవరం బ్రిడ్జి పై నుండి ప్రవహిస్తున్న వరద నీరు

విఆర్.పురం : డొంకరాయి, సీలేరు ప్రాజెక్ట్‌ల నుండి నీటిని విడుదల చేయడంతో శబరి పరివాహక ప్రాంతాలైన మండలంలోని చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, అడవి వెంకన్నగూడెం, సోపల్లి గ్రామాల చుట్టూ వరదనీరు చేరింది. భారీ వర్షాలకు అన్నవరం ఉమ్మడివరం మధ్యలో బ్రిడ్జి పైనుండి వరద రావటంతో సుమారుగా 40 గ్రామాలకు నాలుగు గంటల పాటు రాకపోకలు స్తంభించాయి.

వై.రామవరం : భారీ వర్షాలు కారణంగా వై.రామవరం మండలంలో రహదారులు జలమయమయ్యాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనపై వరద ప్రవహించడంతో బండిగడ్డ, కనతలు బంద, యార్లగడ్డ, గురమందా కోటతో పాటు 60 గ్రామాల ప్రజలు సోమవారం సంత మార్కెట్‌కు రాలేని పరిస్థితి నెలకొంది. వాగులు దాటొద్దని అడ్డతీగల సిఐ నరసింహారావు, ఎస్సై సంతోష్ కుమార్ సూచించారు.

మారేడుమిల్లి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కుండాడ, జీవం వలస రహదారికి అడ్డంగా సోమవారం ఉదయం భారీ వృక్షం నేలకూలింది. దీంతో సుమారు మూడు గంటలు రాకపోకులకు అంతరాయం ఏర్పడింది. ఇది గమనించిన కుండాడ పంచాయతీ సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి గ్రామస్తుల సహాయంతో భారీ వృక్షాన్ని తొలగించారు.

చింతూరు మండలంలో ముంపునకు గురైన రహదారి, పొలాలు

భారీ వర్షాలకు మండలంలోని సున్నంపాడు గ్రామం నుండి నూరుపూడి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న కొండవాగు , బొడ్లంక గ్రామ సమీపాన ఉన్న పెళ్లి రేవు కాలువ, ఆకు మామిడి కోట పరిధిలోని చెలక వీధి సమీపాన ఉన్న కొండవాగులు కలవట్ల మీదకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ గోపాలకృష్ణ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు వాగులు దాట వద్దంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మారేడుమిల్లి- చింతూరు ఘాట్ రోడ్డు పూర్తిగా మూసి వేసినట్లు ఆయన తెలిపారు.

హుకుంపేట : మండలంలోని చీడుపుట్టు, దిగుమొదపుట్టు కల్వర్టుల పై నుంచి వరద నీరు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది.దీంతో, రాకపోకలు నిలిచిపోయాయి. వంతాడపల్లి చెక్ పోస్ట్ నుండి తుంపాడ, కుజ్జెలి, అడ్డుమండ మీదుగా హుకుంపేట వెళ్ళే వాహనచోదకులు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని అధికారులు సూచించారు.

డుంబ్రిగుడ : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మండలంలో గత మూడు రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. గుంటసీమ, రంగిలి సింగి, గుంటగన్నేల, డోమంగి, కించమండతో పాటు పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ప్రముఖ పర్యాటన కేంద్రమైన చాపరాయి జలపాతంలో పర్యాటకుల ప్రవేశాలను నిలుపుదల చేశారు.

కోతకు గురైన మినీ రిజర్వాయర్:

కొర్రాయి పంచాయతీలోని వందలాది ఎకరాల సాగు భూములకు సాగునీరు అందించేందుకుగాను కొర్రాయిలో నిర్మించిన మినీ రిజర్వాయర్‌కు భారీ వర్షాల కారణంగా నీరు ఎక్కువగా చేరడంతో రిజర్వాయర్ దిగువ భాగాన గండి ఏర్పడే పరిస్థితి ఏర్పడింది.వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతో కోతకు గురైన ప్రదేశంలో ఇసుక బస్తాలను వేసి మరమ్మత్తు పనులు చేపట్టినట్లు స్థానిక సర్పంచ్ కొములు తెలిపారు. ఎన్నో ఏళ్ళ నుంచి రిజర్వాయర్కు మరమ్మతు పనులు చేయకపోవడంతో ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత గిరి రైతులు కోరుతున్నారు.

పెదబయలు : మండలంలోని గోమంగి, గుల్లేలు పంచాయతీలకు ఆనుకుని ఉన్న మత్రిపుటు బ్రిడ్జి పొంగి ప్రవహిస్తోంది. గోమంగి సచివాలయం సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.ఇల్లు కూలిపోయినా, వరి పొలాలు కొట్టుకుపోయినా వెంటనే సమాచారం అందించాలని సిబ్బంది కోరారు.గిన్నెల కోట పంచాయతీ లండులు వంతెన వరద ధాటికి కొట్టుకు పోయింది. వంతెన కొట్టుకుపోవడంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంలో వారపు సంత చిత్తడిగా మారింది.

రహదారి క్లిలరెన్స్ పనులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

చట్రాపల్లిలో కొండ చరియలు విరిగిపడ్డ ప్రాంతమిదే..

చట్రాపల్లిలో తీవ్ర విషాదం

గ్రామంపైకి విరిగిపడిన కొండచరియలు
ఒక మహిళ మృతి - ముగ్గురికి తీవ్ర గాయాలు
ధ్వంసమైన 30 ఇళ్లు
మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి-సీలేరు

అల్లూరి జిల్లాలోని జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధి చట్రాపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు, ఆదివారం కురిసిన భారీ వర్షం తోడై చట్రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కొండచరియలు విరిగి పడ్డాయి. విరిగిపడిన కొండచరియలు, బండరాళ్లు అకస్మాత్తుగా గ్రామంపైకి కొట్టుకొచ్చి ఇళ్లపై విరుచుకుపడ్డాయి. కొండ చరియలు కిందపడి గ్రామానికి చెందిన కొర్ర కుమారి (35) మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన కొర్ర పండున్న, కొర్ర సుమిత్ర, కొర్ర సుబ్బారావు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో ఉన్న 30 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

కొర్ర కుమారి (ఫైల్‌ఫొటో)

చట్రాపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరా, సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. భారీ వర్షాలు కారణంగా రహదారులు కొట్టుకుపోయి వాగులు వంకలు పొంగిపొర్లుతుండడంతో సహాయ చర్యలు చేపట్టడానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామస్తులు కొండచరియల్లో చిక్కుకున్న కొంతమందిని కాపాడగలిగారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి పూర్తిస్థాయిలో నష్ట నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సంఘటనలో మృతి చెందిన కొర్ర కుమారి కుటుంబానికి కలెక్టర్ దినేష్ కుమార్ రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

పునరావాస ఏర్పాట్లు చేస్తున్నాం : ఐటిడిఎ పిఒ

చట్రాపల్లి గ్రామస్తులకు పురావాస ఏర్పాట్లు చేస్తున్నామని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. చట్రాపల్లిలో కొండచరియలు విరిగిపడిన విషయం తెలుసుకున్న ఆయన ఆ గ్రామానికి వెళ్లడానికి ప్రయత్నించారు. అయితే రహదారి లేదని అధికారులు చెప్పడంతో గ్రామస్తుల స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. చట్రాపల్లి గ్రామంలో 30 కుటుంబాలు 120 మంది జనాభా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు పిఒ దృష్టికి తీసుకొచ్చారు. చట్రాపల్లి గ్రామస్తులను సప్పర్ల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అందరికి భోజనం, వసతి సదుపాయాలు కల్పించాలని చెప్పారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను రెవెన్యూ అధికారులు ఆధీనంలోకి తీసుకుని బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వైద్య సేవలు అవసరమైన వారికి సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు.

క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కాగా ఓటరు జాబితా

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కా ఓటరు జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, వివిద రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కచ్చితమై జాబితా తయారు చేయడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియకు వెళ్లినపుడు 1686 మంది అందుబాటులో లేరని, 390 మంది తరలి వెళ్లారని, 1387 మంది మృతి చెందారని చెప్పారు. 577 మంది ఓటర్లకు ఫోటోలు సక్రమంగా లేవన్నారు. వాటిని సవరిస్తామని చెప్పారు. డూప్లికేట్ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగిస్తామన్నారు. మూడు నియోజక వర్గాలలో 2424 మందికి ఒకే విధమైన ఫోటోలు ఉన్నాయని అన్నారు.ఓటరు నమోదుపై బూతు స్థాయి అధికారులకు ఓటరు నమోదుపై శిక్షణ అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, డి.ఆర్.ఓ. బి.పద్మాపతి, వివిద రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చాపరాయిలో అన్న సమారాధన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం లో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కమిటీ సభ్యులు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడి చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, కార్యదర్శి సులోచన ఆధ్వర్యాన ఉత్సవాల్లో భాగంగా అన్న సమారధన నిర్వహించారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసాతో సాయంత్రం జలపాతం గెడ్డలో నిమజ్జనం చేపట్టారు.

నేడూ విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఈనెల 10న మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలకు, కళాశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు శెలవు దినముగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

మాడగడకు మోడల్ కాలనీ మంజూరు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-అరకు లోయ : మండలంలోని మాడగడ గ్రామానికి మోడల్ కాలనీ మంజూరు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. తుఫాన్ కారణంగా నష్టాలను పరిశీలించేందుకు మాడగడ పంచాయతీలో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, తుపాను కారణంగా దెబ్బతిన్న ఇల్లుల యజమానులకు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో అల్లూరి జిల్లా అరకులోయ మండలం మాడగడ పంచాయతీ మాడగడ గ్రామంలోని వ్యూ పాయింట్ కి బోసు బెడ్డ నుండి వేస్తున్న రోడ్డు సకాలంలో పూర్తి చేయకపోవడంతో మాడగడలోని ఇల్లుల లోపలికి ప్రవేశించి కూరుకుపోయిందన్నారు.ప్రభుత్వం తక్షణమే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు డిమాండ్ చేశారు.ఇటువంటి తుఫాను వచ్చినప్పు ఇల్లులు దెబ్బతింటున్నాయన్నారు.గత హుదూద్ తుఫాను లో రెండు చోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయని భవిష్యత్తులో మాడగడ గ్రామానికి ప్రమాదం రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వారు అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ కొంత ఉన్నప్పటికీ వరదలు పెరిగినప్పుడు మూసుకుపోయి ఇళ్లలకు వరద నీరు చేరుతుందని తెలిపారు. ఆ గ్రామంలో 500 మీటర్ల వరకు కొత్తగా డ్రైనేజీ మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. మాడగడ గ్రామస్తుల కోసం మోడల్ కాలనీ ఏర్పాటు చేసి సురక్షిత ప్రాంతానికి తరలించాలని వారు డిమాండ్ చేశారు.మాడగడ వ్యూ పాయింట్ కోసం నిర్మిస్తున్న రోడ్డు పనులు వేగవంతం చేసి డ్రైనేజీ వ్యవస్థను పకడ్బందీగా నిర్మించి భవిష్యత్తులో వరదల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నష్ట వివరాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

పర్యాటక ప్రాంతాలు మూసివేత

ప్రజాశక్తి-అరకు లోయ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో అరకులోయ ప్రాంతంలోని భారీ వర్షాలు కురుస్తుండడంతో అరకులోయ ప్రాంతంలోని పర్యాటక సందర్శింత ప్రాంతాలన్నీ మూసి వేశారు. గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తున్న విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో పర్యాటకులు ఇక్కడికి వచ్చి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీలుగా సందర్శిత ప్రాంతాలైన జన సంస్కృతిక మ్యూజియం పద్మావతి ఉద్యానవన కేంద్రం, చాపరాయి జలపాతం వంటి సందర్శిత ప్రాంతం తో పాటు ఐటీడీఏ పరిధిలోని సందర్శిత ప్రాంతాలన్నీ మూసివేయాలని పాడేరు ఐటిడిఎ అభిషేక్ ఆదేశాలు జారీ చేశారు. నిర్వాహకులు ఆది, సోమవారాల్లో సందర్శిత ప్రాంతాలు పూర్తిగా మూసి వేశారు. ఐటిడిఏ పీఓ నుంచి ఆదేశాలు వచ్చేవరకు తెరవబోమని నిర్వాహకులు తెలిపారు. ఈ విషయాన్ని అరకు సందర్శించే పర్యాటకులు గమనించాలని వారు కోరారు. ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తుండడంతో పర్యాటకుల సంఖ్య పూర్తిగా పడిపోయింది. వచ్చిన కొద్ది మంది కూడా వాతావరణం అనుకూలించకపోవడంతో తిరుగు ముఖం పట్టారు. దీంతోపాటు అరకు విశాఖ ఘాట్ రోడ్ లో కొండ చరియలు ఎప్పుడు జారిపడతాయో నన్న భయంతో ఆర్టీసీ బస్సులు కూడా పూర్తిస్థాయిలో నడపలేదు. ఇక్కడి ప్రైవేట్ వాహనాలు కూడా ఘాట్ రోడ్ లో తిరగడానికి ఎవరు సాహసించలేదు. నిత్యం సందడిగా ఉండే అరకులోయ వర్షాల కారణంగా పర్యాటకులు లేక, గ్రామాల గిరిజనులు రాక వేలవెలబోతుంది.

చట్రాపల్లిలో సహాయక చర్యలు చేపట్టాలి

ఆదివాసీ గిరిజన సంఘం నేతలు కిల్లో సురేంద్ర, పొద్దు బాలదేవ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అల్లూరి సీతారామ రాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం గాలికొండ పంచాయితీ చట్రాపల్లి గ్రామంలో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షానికి కొండ చరియలు విరిగిపడిన ఘటనలో కొర్ర కుమారి (20) మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారని, వీరికి ఎక్స్గ్రేషియా చెల్లించి చట్రాపల్లి గ్రామంలో సహాయక చర్యలు చేపట్టాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాలికొండ పంచాయితీ చట్రాపల్లి గ్రామంలో సుమారు 30 ఆదివాసి కుటుంబాలు నివసిస్తున్నారని కురుస్తున్న భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడి గ్రామం కొట్టుకుపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సురక్షిత ప్రాంతంలో తరలించి మోడల్ కాలనీ నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని,ఇల్లు కోల్పోయిన ఆదివాసుల కుటుంబానికి ప్రభుత్వం కొత్త ఇల్లు మంజూరు చేయాలని

బాధితులను ఆదుకోవాలి

చింతపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో అన్ని విధాలుగా నష్టపోయిన అల్లూరి జిల్లా ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ కోరారు. భారీ వర్షాలతో చింతపల్లి మండలం పెదబరడ పంచాయతీకి చెందిన మడిగుంటలోని నర్సీపట్నం -చింతపల్లి ప్రధాన రహదారిలోని అప్రోచ్ రహదారి వరద ప్రభావంతో కొట్టుకుపోవడంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుఫాను ప్రభావంతో అనేక ప్రాంతాల్లోని కల్వర్టుల దగ్గర నుంచి అప్రోచ్ రహదారులు వరద ప్రభావంతో కొట్టుకుపోయాయని వాటి నిర్మాణం కోసం తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జీకే వీధి మండలంలో ఇల్లు కూలి పోయి మరణించిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పనులను పరిశీలిస్తున్న నేతలు

ఐటిడిఎలో కంట్రోల్ రూం ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందున సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసామని ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మూడు షిఫ్టులలో సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. ఐటిడిఏ పరిధిలో 11 మండలాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సమాచారం వెంటనే అందించాలని కోరారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు జె. మాధవి, జూనియర్ అసిస్టెంట్ 7780361430, ఎ.కామేశ్వరరావు జూనియర్ అసిస్టెంట్ 8500374633, సాయంత్రం 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఎల్. దేవా పాత్రుడు జూనియర్ అసిస్టెంట్ 94418 42177, బి. చైతన్య జూనియర్ అసిస్టెంట్ 9494781751, రాత్రి 8 గంటల నుండి మరుసటి రోజు 8 గంటల వరకు వై. రవి కిరణ్ కంపూటర్ ఆపరేటర్, ఎం.ఎ. జిలాని జూనియర్ అసిస్టెంటు 9492784678 ఫోను నంబర్లలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 6 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు జె. తేజేశ్వరరావు, కె. మధు సూదన్ (8688158907) అందుబాటులో ఉంటారని చెప్పారు. అత్యవసర వైద్య సేవలకు 08935 251737, 6303921374 నంబర్లలో అందుబాటులో ఉంటారని చెప్పారు. అత్యవసర సేవలకు పైన పేర్కొన్న ఫోను సంబర్లకు ఫోను చేయాలని సూచించారు. ఎం హేమలత పరిపాలనాధికారి 9441919730, కన్యాకుమారి 8688158907 లను పర్యవేక్షణాధి కారులుగా నియమించామని పి ఓ పేర్కొన్నారు.

రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ జెఇ

రాజ్ మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని చీకుమద్దుల సెగ్మెంట్‌లో రాజ్‌మా విత్తనాలను సోమవారం వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు పంపిణీ చేశారు. చీకుమద్దుల, గన్నేరు పుట్టు పంచాయితీలోని సుమారు 200మంది రైతులకు రాజ్‌మా విత్తనాలను రైతులకి పంపిణీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ధ్రువకుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ గణేష్, సెక్రెటరీ బృంద, వీఆర్ఓ కళ, డిజిటల్ అసిస్టెంట్ లావణ్య, ఏఎన్ఎం రాధ, వీఆర్పీ లు మజ్జి అప్పారావు, పాంగి జోగన్న, వార్డ్ మెంబర్ లు జన్ని విజయ్ కుమార్, మజ్జి రాజారావు, వలసనైని వంశీ, మజ్జి బాబూరావు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో పెదలబుడు పంచాయతీ పరిధిలో నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని సర్పంచ్ పెట్టెలి దాసుబాబు తెలిపారు. సోమవారం పెదలబుడు పంచాయితి గంజాయిగూడ గ్రామంలో సర్పంచ్ పి దాసుబాబు పర్యటించి వర్షాల కారణంగా నేల కూలిన కొర్రా నాగేశ్వరరావు, కొర్రా సీతమ్మ ఇంటిని పరిశీలించారు. పూర్తిగా నేలమట్టమైన ఇంటిని పరిశీలించి బాధితులతో మాట్లాడిన అనంతరం వారికి దాసుబాబు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం అందేలా అధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు. నేల మట్టమైన ఇళ్ల స్థానంలో ఎన్టీఆర్ గృహాలను మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాగరాజు, కిముడు త్రినాథ్, సెక్రటరీ భగత్ రామ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ దాసుబాబు

కొండ శిఖర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయండి

కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: గిరి శిఖర గ్రామాలు, కొండవాలు ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉందన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని స్పష్టం చేసారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ నుండి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దెబ్బతిన్న రహదారులు, వంతెనల సమాచారం అందించాలని స్పష్టం చేసారు. ప్రజలు కాలి నడకన, వాహనాలపైన వాగులు గెడ్డలు దాటకుండా చైతన్యవంతం చేయాలని సూచించారు. తెగిపోయిన గెడ్డలు, వాగుల వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బందిని నియమించాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది నిరంతరం కాజ్ వేలు, కల్వర్టుల పరిస్థితులను పరిశీలించి నివేదించాలని చెప్పారు. మండలాల్లో వర్షపాతం నమోదు సక్రమంగా చేయాలని పేర్కొన్నారు. పాడేరు డివిజన్లో తొమ్మిది చోట్ల, రంపచోడవరం డివిజన్లో ఏడు చోట్ల రకాపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రమాదాలు, తాగునీటి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పంటనష్టాలను నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ఐదు ఘాట్ రోడ్లలో వాహనాల రవాణాను నిషేదం పొడిగించాలన్నారు. నిత్యావసర సరుకులు, అత్యవసర సేవల వాహనాలను అనుమతించాలని అధికారులను ఆదేశించారు. రహదారుల పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతి పదికన చేపట్టాలని ఆదేశించారు. రానున్న 24 గంటల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేసి రవాణా సదుపాయాలు మెరుగు పరచాలన్నారు. జోలాపుట్టు డ్యాం ఏడు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారని, లోతట్టు గ్రామాల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలన్నారు. చింతూరు డివిజన్ శబరి నదికి 38 అడుగుల నీటి మట్టం పెరిగినందున ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలన్నారు. రంపచోడవరం డివిజన్ లో అన్ని మండలాలలో నీటి ప్రవాహాలు అధికంగా ఉందని చెట్లు నేలకొరిగే అవకాశం ఉందని అవసరమైన చోట పునరావాసం కల్పించాలని పేర్కొన్నారు. పాడేరు డివిజన్ పాడు పడి భవనాలు, మట్టి నిర్మాణాలు, కల్వర్టులు పరిశీలించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. జి.కె. వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కొండ చరియలు విరిగి పడి మృతి చెందిన కొర్రా 8(20) కుటుంబ సభ్యులకు జాతీయ, రాష్ట్ర విపత్తుల సంస్థ నిబంధనల మేరకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను జిల్లా కలెక్టర్ ప్రకటించారు. మరో ముగ్గురు వ్యక్తులు కొర్రా పండన్న (60), కొర్రా సుమిత్ర (18) కొర్రా సుబ్బారావు (25) గాయ పడ్డారని వారిని సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స అందిస్తున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, డి.ఆర్.ఓ బి.పద్మావతి, సిపి ఓ ఎస్. ఎస్. ఆర్.కె. పట్నాయక్, ఎస్సీ సుమీత్ బర్దార్, ఐటిడి ఏ పివోలు, కట్టా సింహాచలం, అపూర్వ భరత్, సబ్ కలెక్టర్లు కల్పశ్రీ, సౌర్యమన్ పటేల్, తహశీల్దారులు, ఎంపిడి ఓలు తదితరులు పాల్గొన్నారు.

పివిటిజిలకు ఇళ్లు మంజూరు చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుతున్న సర్పంచ్ చిన్నబాబు, గ్రామస్తులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పీఎం జన్మన్ వికాస్ యోజన పథకం ద్వారా అర్హులైన పీవీటీజి కుటుంబాలకు ఇల్లు మంజూరు, పోడు భూములకు సర్వే చేసిన ప్రతి ఒక్కరికి కొండ పోడు పట్టాలు పంపిణి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు, సుంకర మెట్ట సర్పంచ్ గెమ్మెల చిన్న బాబు డిమాండ్ చేశారు. మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ దాబుగుడా గ్రామంలో సోమవారం పర్యటన చేసి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిరసన చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పంచాయతీలో గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పీఎం జన్మన్ వికాస్ యోజన పథకం ద్వారా ఇళ్ళు మంజూరు చేయాలన్నారు. మంజూరై ఇప్పటి ఏడు నెలలు గడిచినా డబ్బులు అకౌంట్‌లో జమ కాలేదని, వారికీ తక్షణమే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పీఎం జన్మన్ కింద ఒక ఇంటి నిర్మాణనికి ఇస్తున్న 2లక్షల 39 వేలు గిరిజన ప్రాంతంలో ఏ మూలకి సరిపోవన్నారు. ఒక్కో ఇల్లు నిర్మాణానికి 5 లక్షలు పెంచాలని చెప్పారు. పీఎం -జన్మన్ హౌసింగ్ సర్వేలో సాంకేతిక కారణాలతో తిరస్కరించబడ్డ పేర్లను అర్హులుగా గుర్తించి ఇల్లు మంజూరు చేయాలన్నారు. అరకువేలి మండల వ్యాప్తంగా అనేక పివీటీజి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేవని, ప్రతి గిరిజన గ్రామానికి సీసీ రోడ్డు, డ్రైనేజీ, కొత్త విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేయాలన్నారు. పీఎం -జన్మన్ యోజన లో భాగంగా ఎలక్షన్ కు ముందు సుంకర మెట్ట పంచాయతీ లో 98 పివిటిజి కుటుంబాలకు సర్వే చేసిన రైతులకు పోడు భూమి పట్టాలు పంపిణి చేయాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని లేకపోతే రైతులతో కలిసి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల తహశిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆనంద్ రావు, ప్రేమ్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి-గాజువాక : లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన జగ్గు సెంటర్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పంతులుగారు మేడకు చెందిన మాలకొండ రెడ్డి (70) స్కూటీపై వెనుక కూర్చుని ఉన్నాడు. స్కూటీని కోటేశ్వరరావు నడుపుతున్నాడు. జగ్గుసెంటర్ వద్దకు వచ్చేసరికి గోతిలో వాహనం పడి ఆగిపోయింది. దీంతో వెనుక నుంచి వస్తున్న లారీ స్కూటీని ఢీకొట్టింది. స్కూటీ వెనుక కూర్చుని ఉన్న మాలకొండరెడ్డిని ఢీకొనడంతో ఆయన రోడ్డు మీద పడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కైలాసగిరిపై అదుపు తప్పిన బస్సు

18 మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : కైలాసగిరి కొండపై యాత్రికుల బస్సు హ్యాండ్ బ్రేక్ జారి అదుపు తప్పి గోడను ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గోడను ఢీకొట్టి బస్సు ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... చత్తీష్‌ఘడ్‌కు చెందిన సుమారు 18 మంది యాత్రికులు నగరంలో ఉన్న ప్రయివేటు బస్సును బుక్ చేసుకొని కైలాసగిరి కొండపైకి వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి కిందికి దిగేందుకు డ్రైవర్ బస్సును లైన్‌లో పెట్టి హ్యాండ్ బ్రేక్ వేసి కిందికి దిగాడు. యాత్రికులు ఒక్కొక్కరు బస్సులోకి వెళ్తున్నారు. ఈ క్రమంలో హ్యాండ్ బ్రేక్ కిందికి జారడంతో బస్సు నెమ్మదిగా కిందకు వెళ్ళి పక్కనే ఉన్న గోడకు ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. వెంటనే గాయాలైన ప్రయాణికులను కెజిహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న నగర పోలీసు కమిషనర్ కెజిహెచ్‌కు వెళ్లి గాయాలైన ప్రయాణికులను పరామర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.

రేకు షెడ్డు వద్ద విద్యార్థులతో టీచర్

సొంత డబ్బులతో పాఠశాల రేకుల షెడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి అనంతగిరి: ఉన్న పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు తన సొంత డబ్బులతో తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం అసలు వెలగెడ్డ పంచాయతీ దాసరతోట గ్రామంలో పాఠశాల భవనం పూర్తిగా శిదిలావస్థకు చేరుకుంది. కురుస్తున్న వర్షాలకు పెను ప్రమాదం పొంచి ఉండడంతో ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు ఝాన్సీ తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని తరగతుల విద్యా బోధన కొనసాగిస్తోంది.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పాడేరు: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో కారణంగా గూడెం కొత్త వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, అవసరమైన సహాయక కార్యక్రమాల అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పాలికి లక్కు సోమవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశార. బాధిత కుటుంబానికి 75 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు.

రేఖపల్లిలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సరోజిని తదితరులు

రేఖపల్లిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామంలో సోమవారం సర్పంచ్ పూనం సరోజిని, సెక్రటరీ శివ ప్రసాద్ ఆధ్వర్యాన పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు గుంటల్లో ఉన్న నీళ్లను ఇంజన్, జెసిపి సహాయంతో తొలగింపుజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బీభత్సం ప్రభుత్వ వైఫల్యమే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రస్తుత విజయవాడ వరద బీభత్సం ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని రాష్ట్ర మాజీ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. సోమవారం విశాఖ నగరంలోని లాసన్స్ బే కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన పది రోజులుగా విజయవాడ వరదలు, మంపులో 45 మంది ప్రాణాలు కోల్పోయారని, వాటిని తాము రాజకీయ హత్యలుగానే పరిగణిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం నడిబొడ్డున విజయవాడ ప్రాంతంలో అంతపెద్ద ఎత్తున వరద వస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వం తీరును ప్రజలు విమర్శిస్తున్నారని తెలిపారు. ఇటువంటి సమయాల్లో ప్రజల అవస్థలను పక్కనపెట్టి పూటకో ప్రెస్‌మీట్ పెట్టి విపత్తును పబ్లిసిటీకి వాడుకోవడం తగదన్నారు. బుడమేరు కాలువ నుంచి వరద పెరుగుతుందని 20 గంటల ముందుగానే సమాచారం ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. ఆ ప్రాంతంలో రెండు లక్షల మందిని ఒక్కసారిగా తరలించేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయకపోవడం వల్లే అధికారులు ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉండిపోయారని అన్నారు. అధికారుల సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను, రేషన్ బండ్లను వాడుకుని కూటమి ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వం ముందు చూపుతో ఉండబట్టే ఇప్పుడు వరద సహాయక చర్యలు సులభతరం అయ్యాయని అన్నారు. రాష్ట్రంలో ఏదైనా మంచి జరిగితే అది టిడిపి ద్వారా జరిగినట్టు, చెడు జరిగితే అది వైసిపి ద్వారా జరిగినట్టు ప్రభుత్వం ప్రచారం చేస్తోందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు అనకాపల్లి జిల్లాలో భారీగా పంట నీట మునుగుతుంటే ఒక్క మంత్రి కూడా కనీసం సమీక్ష జరపలేదన్నారు.

నేడు 'ఉక్కు' రక్షణకు రాస్తారోకోలు

- జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్తి సామర్థ్యంలో ఉత్పత్తి చేయాలని, అవసరమైన ముడుసరుకును కేటాయించాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపునిచ్చిన నేపథ్యంలో కార్మికులు, ప్రజలు అందుకు సిద్ధమవుతున్నారు. పిలుపులో భాగంగా మంగళవారం విశాఖ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో, పరిశ్రమల వద్ద జరిగే నిరసన కార్యక్రమాలలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నుంచి అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరుగుతుందన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేపట్టనున్నామన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే కార్మికుల సంఖ్యను, ఉత్పత్తిని తగ్గించాలని చూస్తోందని తెలిపారు.

ప్రవాహం తగ్గే వరకు వాగులు దాటొద్దు

ప్రజాశక్తి-రంపచోడవరం

తుఫాను ప్రభావం వలన ఏజెన్సీలోని కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవాహం తగ్గేవరకు కాలువలు దాటవద్దని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచ ఏజెన్సీ ప్రజలను కోరారు. సోమవారం భూపతిపాలెం ప్రాజెక్టు, రంపచోడవరం నుండి రంప మధ్య కాలువ వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. భూపతిపాలెం ప్రాజెక్టులో వరద నీరు ఉధృతం ఉన్న నేపథ్యంలో చేపల వేట చేయించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. మారేడుమిల్లి మండలంలోని వివిధ గ్రామాలలో కొండ కాలువల ఉధృతిని ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. తుఫాను వలన ఎక్కడైనా కరెంటు స్తంభాలు విరిగిపోతే వాటిని వెంటనే పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పిఒ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఎండి యూసఫ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లిలో అర్ధరాత్రి కొండ చరియలు విరిగి పడడంతో మృతిచెందిన కొర్రా కుమారి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరకు - విశాఖపట్నం వచ్చే ఘాట్ రోడ్లలోనూ కొండచరియలు విరిగిపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పంపించి సహాయక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. చట్రాపల్లిలో సర్వం కోల్పోయిన వారిని ఆదుకోవాలని, వారిని సురక్షిత ప్రాంతానికి తరలించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జలాశయాల నుండి నీరు విడుదల

గుంటవాడ జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

ప్రజాశక్తి-సీలేరు

భారీ వర్షాల నేపథ్యంలో సీలేరు కాంప్లెక్స్‌లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో జలాశయాలు ప్రమాద స్థాయికి చేరుకోవడంతో జెన్కో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోని దిగువసీలేరు డొంకరాయి, గుంటవాడ జలాశయాల నుండి వరద నీటిని దిగు ప్రాంతానికి విడుదల చేస్తున్నారు. డొంకరాయి పూర్తిస్థాయి నీటిమట్టం 1037కాగా, వాగుల నుండి ఒక లక్ష పదివేల క్యూసెక్కులు వరద నీరు చేరుతుంది. 7 గేట్ల ద్వారా ఒక లక్ష పదివేల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. సాడిల్ డాం గేట్ల ద్వారా 2000 క్యూసెక్కులు దిగు ప్రాంతాన్ని నీటిని విడుదల చేస్తున్నారు. గుంటవాడ జలాశయంలోకి పిల్లి గెడ్డ వాగు నుంచి 23 వేల క్యూసెక్కులు వరదనీరు వస్తోంది. గుంటవాడ జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 1360 అడుగులు కాగా సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు 1358.0 అడుగుల నీటిమట్టనికి చేరుకుంది. సోమవారం ఉదయం నుంచి 28, 564 క్యూ సెక్కులు నీటిని దిగు ప్రాంతానికి విడుదల చేశారు. బలిమెల జలాశయం నీటిమట్టం 1516 అడుగులు కాగా ప్రస్తుతం 1510 అడుగులు నీటిమట్టలు చేరుకున్నాయి. మరొక మూడు నాలుగు అడుగులు నీటి మట్టాలు పెరిగితే బలిమెల జలాశయం నుంచి దిగు ప్రాంతానికి నీటి విడుదల చేయడానికి ఒరిస్సా అధికారులు చర్యలు చేపడుతున్నారు. బలిమెల జలాశయం గేట్లు నుచి దిగువ ప్రాంతానికి విడుదల చేస్తే గుంటవాడ జలాశయం వరద నీరు పోటెత్తుతుంది.

భూపతిపాలెం రిజర్వాయర్ నుండి..

రంపచోడవరం : మండలం భూపతిపాలెం రిజర్వాయర్‌కు ఎగువ నుండి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి సుమారు 12 వందల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దీంతో రంపచోడవరం -రంప గ్రామాల మధ్య ఉన్న రంప కాజ్‌వే పైనుండి వరద నీరు ఉధృతగా ప్రవహిస్తూ ఉండడంతో అప్రమత్తమైన రెవెన్యూ పోలీస్ అధికారులు రంప కాజువే వద్ద ప్రజలు వాగు దాటకుండా పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. దీంతో మండల కేంద్రానికి సుమారు పది గ్రామాలకు కొద్దిగా గంటలసేపు రాకపోకలు నిలిచిపోయాయి.

భూపతిపాలెం రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు

పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కాకి స్వామి, దాసరి తరుణ్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు, వాటర్ బాటిల్స్, జ్యూస్ సోమవారం పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ తాళ్లూరి డేవిడ్, డాక్టర్ ఎం సరస్వతి, జనసేన నాయకుల ఆధ్వర్యాన ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కట్టుమూరి వీరబాబు, కర్రి మహేష్, మడకం వెంకటేష్, తుర్రం రమేష్ దొర, సోదే రవికుమార్, తాతి రాజేష్, కొనుతుల పోతురాజు, తోకల పండు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి-కూనవరం : భారీ వర్షాలకు వరదలు వచ్చే అవకాశం ఉందని, దాని వల్ల మండల ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అత్యవసర పరిస్థితుల్లో తమకు సమాచారం ఇవ్వాలని స్థానిక ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో పోలీస్ శాఖకు ఫ్లడ్ కంట్రోల్ రూమ్ సంప్రదించవచ్చని తెలిపారు.

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగర పరిధిలో ఉన్న అన్ని కొండవాలు ప్రాంతాల్లో తక్షణమే రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు, జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్‌కు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సోమవారం వినతి పత్రాలు సమర్పించారు. జివిఎంసి పరిధిలోని అన్ని కొండవాలు ప్రాంతాలలోనూ ప్రజలు దశాబ్దాల తరబడి లక్షల సంఖ్యలో నివాసముంటున్నారని, గతంలో ఒడిఎ నిధుల ద్వారా ప్రభుత్వం రక్షణ గోడలు, రోడ్లు, కాలువలు, విద్యుత్, మంచినీరు, కమ్యూనిటీ భవనాలు మొదలగు మౌలిక సదుపాయాలు కల్పించి ఈ ప్రాంతాలను కొంత అభివృద్ధి చేసిందని తెలిపారు. ఈ నిర్మాణాలు జరిగి సుమారు 35 సంవత్సరాలు అవుతోందన్నారు. నాటి ఈ నిర్మాణాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయని, వర్షాలు పడుతున్న ప్రతి సందర్భంలోనూ పలు ప్రాంతాల్లో రక్షణ గోడలు కూలిపోవడం ప్రాణ, ఆస్తి నష్టం జరగడం పరిపాటిగా మారిందని తెలిపారు. తాజా వర్షాలకు ఆదివారం జివిఎంసి 91వ వార్డు, రామకృష్ణానగర్‌లో గోడ, రహదారి కూలిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో రక్షణ గోడలే లేకపోవడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని తెలిపారు.

పలువురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రేంజ్‌లో విఆర్ విధులు నిర్వహిస్తున్న పలువురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగులు జారీ చేస్తూ విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగులు పొందిన వారిలో విఆర్ విశాఖపట్నం రేంజ్‌లో పనిచేస్తున్న వానపల్లి నాగరాజును శ్రీకాకుళం జిల్లా ట్రాఫిక్ విభాగానికి, ఎంవివి రమణమూర్తిని విజయనగరం జిల్లా విఆర్‌కు, ఎం.బుచ్చిరాజులును అనకాపల్లి జిల్లా పిసిఆర్‌కు, జి.దుర్గాప్రసాద్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా సోషల్ మీడియా సెల్‌కు, జిఆర్‌కె తులసీదాస్‌ను శ్రీకాకుళం జిల్లా డిటిసికి, సువ్వరి రామును అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్‌డిపిఎస్ టాస్క్ ఫోర్స్‌కు, ఎస్‌కె గపూర్‌ను అనకాపల్లి జిల్లా విఆర్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా నర్సీపట్నం టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గంగుల గోవిందరావును విశాఖపట్నం రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు.